సాక్షి
వికారాబాద్
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



పాడుబడిన ఇళ్లు కూల్చేయండి

ధారూరు మండల కేంద్రంలో పాడుబడిన ఇళ్లు కూల్చివేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధికారులను ఆదేశించారు. 8లో▸




డెలివరీ పేరిట దోపిడీ

వంట గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ పేరుతో వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నాయి. ఇష్టారాజ్యంగా డబ్బు వసూళ్లు చేస్తున్నారు. 8లో▸



అప్రమత్తంగా ఉండాలి

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తాండూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ నాగార్జున అన్నారు. 9లో▸





రేగడిమైలారం గ్రామంలో జొన్న అంబలి పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అంబలి సేవ.. 120 ఏళ్ల తోవ



- రేగడిమైలారంలో ఉచిత అంబలి కేంద్రం
- ఆదర్శంగా నిలుస్తున్న బలిజ కుటుంబాలు

బొంరాస్‌పేట: వేసవిలో దప్పిక తీర్చాలన్న సంకల్పం.. నాటి నుంచి వస్తున్న పెద్దల ఆచారం.. వెరసి 120 ఏళ్లుగా ఉచిత అంబలి సేవ కొనసాగుతోంది. ప్రజల సేదతీరుస్తున్న బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం బలిజ కుటుంబాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతిఏటా వేసవిలో గ్రామస్తులు, ప్రయాణికులకు ఉచితంగా అంబలి అందిస్తూ ఆరోగ్యం పంచుతున్నారు.

ఆనవాయితీ ఇలా..

ప్రయాణ సౌకర్యం లేని ఆ రోజుల్లో కొడంగల్ పట్టణానికి కాలినడకనే ప్రజలు వెళ్లేవారు. వేసవి కాలంలో ప్రజల సేద తీర్చాలని గ్రామ సమీపంలోని బసవన్న గుడి దగ్గర శివ భక్తులైన వీరి పూర్వీకులు తారాపురం బసమ్మ ఈ అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు చెబుతున్నారు. ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ ఆ కుటుంబాల వారు కొనసాగిస్తూ మన్ననలు పొందుతున్నారు.

అంబలిపంచే కుటుంబాలు

గ్రామానికి చెందిన తారాపురం సిద్ధమ్మ, నిడుగుంద చంద్రకళ, తారాపురం నీలమ్మ, తారాపురం శ్రీశైలమ్మలు వంతుల వారీగా అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తూ పెద్దల ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో జొన్నలు పండించకపోయినా తమ ఆనవాయితీని నిలబెట్టేందుకు కొనుగోలు చేసి అంబలి కాస్తున్నామంటున్నారు. ఈ సేవను తమ అదృష్టంగా భావిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతియేటా వేసవిలో ఐదు వారాల పాటు ఒక్కో కుటుంబం వారు అంబలిని పంపిణీ చేస్తున్నారు. ప్రతి బుధవారం సంత జరుగుతుండటంతో ఆ రోజు సుమారు 200 మందికిపైగా అంబలి పంపిణీ చేస్తుండటం గమనార్హం.

న్యూస్‌రీల్

అనంతగిరిలో ఎమ్మెల్యే పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దంపతులు

అనంతగిరి: అనంతపద్మనాభ స్వామి ఆలయంలో బుధవారం పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వారి పెళ్లి రోజును పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం అర్చకుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అలాగే వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల కుటుంబసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పలువురు కుటుంబసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల నిరవధిక సమ్మె



ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏల నిరసన

తాండూరు రూరల్: విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీఓఏ)కు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట బుధవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ అరకొర జీతంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేసేవరకు నిరవధిక సమ్మె కొన సాగిస్తామని అన్నారు. డ్రెస్ కోడ్‌తో పాటు ప్రత్యేక ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. రూ.5 లక్షల ఇన్సురెన్స్ కూడా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు దీప, కార్యదర్శి అశోక్, కోశాధికారి కృష్ణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

జిప్సం ఫ్యాక్టరీని మూసివేయించండి

డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌కు సర్పంచ్ వినతి



డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని గుంతబాసుపల్లి శివారులో ఉన్న జిప్సం ఫ్యాక్టరీని మూసివేయించాలని సర్పంచ్ జగదీశ్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్‌ఓ)అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గత నెల 15న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జిప్సం ఫ్యాక్టరీని మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్తర్వులు పట్టుకొని పోలీస్, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ స్పందించడంలేదన్నారు. డీఆర్‌ఓను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు చెప్పారు. జిప్సం ఫ్యాక్టరీ వల్ల పరిసర ప్రాంతాలన్నీ కలుషితమవడమేకాక, ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. చివరకు తాగునీరు కూడా కలుషితమవుతోందన్నారు. గతంలో ఎమ్మెల్యే ఆదేశించినా కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. దౌర్జన్యంగా, ఇష్టానుసారంగా కంపెనీ నిర్వహిస్తున్నారన్నారు.

అంతులేని అవినీతి

జిల్లాలో అవినీతి వేళ్లూనుకుంది. పర్సెంటేజీల పర్వం జోరందుకుంది. ఏ శాఖలో చూసినా పైసలు ఇవ్వనిదే పని జరగడంలేదు. కాంట్రాక్టర్లు పనులు నిర్వహించి నెలలు గడుస్తున్నా మోక్షం లభించడంలేదు. బిల్లులు చేసేందుకు అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తుండటమే ఇందుకుకారణం. తాజాగా ఏసీబీకి చిక్కిన సైట్ ఇంజినీర్ ఘటనే ఇందుకు నిదర్శనం. మనబడి పనుల్లో లంచం ఇస్తేనే బిల్లులు చేస్తానని సదరు కాంట్రాక్టర్‌ను తీవ్ర ఒత్తిడికి గురిచేయడం చూస్తుంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పర్సెంటేజీల పర్వం

- కాంట్రాక్టర్లు పనులు చేపట్టినా రాని బిల్లులు
- డబ్బులు ఇస్తేనే చెల్లింపులు
- పైస్థాయి అధికారుల వరకూ వాటాలు
- అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి
- ఏసీబీకి చిక్కుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనం



ఏసీబీకి చిక్కిన సైట్ ఇంజినీర్ (ఫైల్)

వికారాబాద్: 'మనబడి పనులు చేసి నెలలు గడుస్తోంది.. పూర్తి చేసిన పనులను సైతం రెండునెలల క్రితమే ఎమ్మెల్యే ప్రారంభించారు. అయినా చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా సదరు అధికారి ముప్పుతిప్పలు పెడుతున్నారు. పనులను చూసేందుకు వచ్చిన ప్రతి సారీ డబ్బులు అడుగుతున్నారు. ఇప్పటికే రూ.70వేలకు పైగా ఇచ్చాను. అయినా మళ్లీ డబ్బులు అడుగుతున్నారు. చేసేది లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాను' అని మనబడి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రాజు వాపోయారు. జిల్లాలో చాలా మంది కాంట్రాక్టర్ల పరిస్థితి ఇలానే ఉంది. చేసిన పనులకు బిల్లులు చేయకుండా సంబంధిత అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. లంచావతారుల బాధలు తట్టుకోలేక అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

అన్ని విభాగాల్లోనూ..

ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి అంతులేకుండా సాగుతోంది. ఇటీవల తాండూరులో ఓ సబ్ రిజిస్ట్రార్, పరిగిలో ఎంపీడీఓ, ఈజీఎస్ ఉద్యోగులు, డిప్యూటీ తహసీల్దార్, వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో ఓ పోలీసు అధికారి లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఘటనలు తెలిసిందే. తాజాగా ఏఈ విద్యా మౌలిక వసరుల కల్పన సంస్థకు సంబంధించిన అధికారి పట్టుబడ్డారు. మిగతా ఇంజనీరింగ్ విభాగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని బాధితులు వాపోతున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపల్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఏదయినా లెక్క తక్కువ కాకుండా పర్సెంటేజీలు వసూలు చేస్తున్నారని బాధితులు బాహాటంగా చెబుతున్నారు.

పైస్థాయి అధికారులకూ వాటాలు

క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించి బిల్లులు చేసే ఏఈలు, డీఈలే కాకుండా వారిపైన ఉండే పర్యవేక్షణాధికారులకు సైతం వాటాలున్నట్టు కాంట్రాక్టర్లు, కింది స్థాయి ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. అన్ని స్థాయిల అధికారులకు వాటా ఉండటంవల్లే కింది స్థాయి అధికారుల అవినీతిని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంజనీరింగ్ వ్యవస్థలో పర్సంటేజీల వ్యవహారం వ్యవస్థీకృతంగా మారిపోయింది. వీరు తీసుకునే పర్సంటేజీలలో కొందరు నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులకు సైతం ముడుపులు అందుతాయని అందుకే వారు కూడా ఈ విషయంలో నోరుమెదపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా అవినీతి హెచ్చుమీరుతుంటే పనుల్లో నాణ్యత ఎలా ఆశించగమనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. కలెక్టర్ దృష్టిసారించాలని పలువురు పేర్కొంటున్నారు.

రూ.15వేలు ఇస్తేనే కల్యాణలక్ష్మి చెక్కు ఇస్తా

- ఆర్ఐ భాగ్యలక్ష్మి డిమాండ్
- తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధిత మహిళ



కుర్మ మొగులమ్మ, లబ్ధిదారు

బషీరాబాద్: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాగ్యలక్ష్మి అవినీతి బాగోతం మరోసారి బయటపడింది. కల్యాణలక్ష్మి దరఖాస్తుపై సంతకం చేసేందుకు లబ్ధిదారు నుంచి రూ.5 వేలు వసూలు చేసిన సదరు అధికారి చెక్కు ఇవ్వడానికి మరో రూ.15 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధిత లబ్ధిదారు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మి అవినీతిపై 2022 అక్టోబర్ 22న 'ఆమె సంతకం: రూ. 5వేలు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అప్పట్లో అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి నిజమని తేలడంతో ఆమెకు మెమో జారీ చేశారు. అయినా ఆర్ఐ తీరు మారలేదు. తాజాగా మండలంలోని జీవన్గీ గ్రామానికి చెందిన మొగులమ్మ కల్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోగా సంతకం చేయడానికి ఆర్ఐ రూ. 5వేలు తీసుకున్నారు. చెక్కు వచ్చి 15 రోజులు అవుతున్నా లబ్ధిదారుకు ఇవ్వలేదు. ఈవిషయమై బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆర్ఐ భాగ్యలక్ష్మిని బాధిత మహిళ నిలదీసింది. రూ. 15వేలు ఇచ్చి తీసుకెళ్లు.. లేదంటే వెనక్కు పంపుతా అంటూ బెదిరించింది. దీంతో తహసీల్దార్ ను ఆశ్రయించగా రాద్ధాంతం చేయవద్దని బాధిత మహిళకు సూచించి చెక్కు ఇప్పించడం గమనార్హం.

సెక్షన్ నుంచి తొలగించాం

కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేందుకు లబ్దిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారని ఆర్ఐ భాగ్యలక్ష్మిపై ఫిర్యాదు అందినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణలు రావడంతో విచారణ జరిపి మెమో ఇచ్చాం. ఆమెను కల్యాణలక్ష్మి సెక్షన్ నుంచి తొలగించినట్లు చెప్పారు. చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.



తిర్మలాపూర్‌లో వన నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్

వంద రోజుల పని కల్పిస్తాం

- ఉపాధి కూలీలతో అభివృద్ధి పనులు చేపడతాం
- పొలాలకు వెళ్లే బండ్లబాటలను మెరుగుపరుస్తాం
- జిల్లా వ్యాప్తంగా రూ.60 కోట్లతో సీసీరోడ్లు
- కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి

పూడూరు: ఉపాధి హామీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పిస్తామని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, రాకంచర్ల, మీర్జాపూర్ గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా హరితహారం, వన నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, ఉపాధి హామీ ద్వారా చేపట్టిన ఫార్మేషన్ రోడ్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలతో మూడు ముఖ్యమైన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యంతో పాటు గ్రామ కంఠం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పొలాలకు వెళ్లే బండ్ల బాటలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండటమేకాకుండా భూముల విలువ పెరిగి రైతులకు లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. పాత నక్ష రోడ్లను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ కూలీలతో ఇరిగేషన్ చెరువుల కింద ఉన్న అన్ని కాల్వల్లో పూడికతీత పనులు చేపడతామన్నారు. రూ.60కోట్లతో పంచాయతీల్లో సీసీ రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. మిగిలిన అన్ని గ్రామాల్లో జూన్ మాసం వరకు సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి అన్ని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. తిర్మలాపూర్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బాగున్నాయని కలెక్టర్ కితాబునిచ్చారు. సర్పంచ్ కమ్లీబాయిపెంటయ్యను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కృష్ణన్, ఎంపీడీఓ ఉమాదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన్, ఎంపీఓ సుందర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకుని చర్యలు చేపట్టాలని ఉత్సవ కమిటీ సభ్యులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేసినందుకు ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్‌ని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిబాపూలే, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో విజయవంతం చేసినట్లు తెలిపారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహ స్థాపనకు ప్రత్యేక కమిటీ వేసుకొని స్థానిక ప్రజా ప్రతినిధులు, టీఎన్జీవో, రెవెన్యూ అసోసియేషన్ల వద్ద నుంచి నిధులను సమీకరించుకోవాలన్నారు. బాబు జగ్జీవన్ రామ్ భవన నిర్మాణానికి ఇప్పటికే స్థలాన్ని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

- సీఈఐఆర్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ఎస్పీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సీఈఐఆర్ వెబ్‌సైట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ కోటిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పీఎస్‌లలో నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులపై స్టేషన్ల వారీగా ఆరా తీశారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, ఏమైన సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. యూఐ కేసులు, ఎన్‌బీడబ్ల్యూఎస్, పాత పెండింగ్ కేసులు, పోక్సో, అట్రాసిటీ కేసులు, ఎన్‌డీపీఎస్ యాక్టు కేసులపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి శనివారం పీఎస్‌లలో సిబ్బందితో సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్షించుకోవాలన్నారు. నూతనంగా మొదలైన సీఈఐఆర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, మొబైల్ పడిపోయినా, చోరికి గురైనా బాధితులు ఈ వెబ్‌సైట్‌లో తమ వివరాలు పొందుపరిచే విధంగా అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

ఎమ్మెల్యే సాక్షిగా ప్రొటోకాల్ రగడ

భౌతిక దాడులకు దిగిన బీఆర్‌ఎస్ నాయకులు

బషీరాబాద్: మండలంలోని గొట్టిగ ఖుర్దు గ్రామంలో రోహిత్‌రెడ్డి నిర్వహించిన పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమం రసాభాసగా మారింది. వేదిక మీద వైస్ ఎంపీపీ భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు అనంతయ్యని ఏ హోదాలో కుర్చీలో కూర్చుంటారని సర్పంచ్ విష్ణు వర్ధన్‌రెడ్డి నిలదేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వారించినా ఇద్దరు నాయకులు వినిపించుకోలేదు. ఇరు వర్గాలు వారు ఒకరినొకరు తోసుకున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం ముగించుకొని వెళ్లాక అనంతయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి భౌతికదాడులకు దిగారు. ఈ ఘటనలో వైస్ ఎంపీపీ అన్నపూర్ణకు గాయమైంది. సమావేశంలో ప్రొటోకాల్ పాటించకుండా తమను అవమానించారని సర్పంచ్ వాపోయారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నాయకుడు అనంతయ్య, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి వాగ్వాదం

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వికారాబాద్ అర్బన్: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయని, పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఓపెన్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. టెన్త్ ఓపెన్ పరీక్షలకు వికారాబాద్‌లో 1, తాండూరులో 2 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 2,668 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలకు వికారాబాద్‌లో 3, తాండూరులో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,129మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్, వాచ్‌లను అనుమతించరాదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసే విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్, తొమ్మిది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, అదనపు ఎస్పీ మురళీధర్ రావు, డీఎంహెచ్ఓ పాల్వన్ కుమార్, విద్యుత్ శాఖ ఏడీ రాంచంద్రయ్య, హెడ్ పోస్ట్ మాస్టర్ అయుబ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

పెద్దేముల్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి మండలంలోని రుక్మాపూర్ మీదుగా మంబాపూర్‌కు వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను బ్లూ కోట్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు.

అన్ని మతాలకు సముచిత స్థానం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



వృద్ధురాలికి కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: సీఎం కేసీఆర్ అన్ని మతాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జామా మసీదులో ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 5మండలాలకు మొత్తం 15వందల మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లింలకు కానుకలు అందజేస్తున్నట్లు తెలిపారు. పండగను ఆనందోత్సావాలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ రాంచందర్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, డాక్టర్ నవాజ్, మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం గౌసన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

స్నేహభావానికి ప్రతీక రంజాన్

కుల్కచర్ల: రంజాన్ పండగను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కుల్కచర్ల, బండవెల్కిచర్ల గ్రామాల్లో గల మసీదుల్లో కాంగ్రెస్ పార్టీ స్థానిక నేతల ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగ స్నేహభావానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేష్, నాయకులు లక్ష్మారెడ్డి, రుక్కు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడ శివారులో బుధవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఓ వ్యక్తి(40) మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో మండల పరిధిలోని బూర్గుల, చింతగూడ గ్రామాల్లో చిత్తు కాగితాలను సేకరిస్తూ హిందీలో మాట్లాడుతూ సమీప హోటల్‌లలో ఆహారం అడుక్కొని తింటూ జీవనం వెల్లదీస్తున్నాడు. ఈ నేపథ్యంలో చింతగూడ శివారులోని పారిశ్రామిక వాడలోని పార్కులో విగతజీవిగా పడిఉన్నాడు. పార్కు పనిచేసే మహిళలకు దుర్వాసన రావడంతో సర్పంచ్ రామయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో సర్పంచ్ పోలీసులకు విషయం తెలపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడురోజుల క్రితం మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఇతర రాష్ట్రాలకు చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా వెంటనే 9440795741, 9441285247 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సర్పంచ్ రామయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

డెలివరీ పేరిట దోపిడీ

గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం
- ఫిర్యాదు చేసినా స్పందించని పౌరసరఫరాల శాఖ
- రెండేళ్ల నుంచి ఇదే తంతు
- చర్యలు తీసుకోవాలని వినతి



పెద్దేముల్: వంట గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ పేరుతో వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఓ వైపు ప్రతి నెలా గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం, మరో వైపు ఏజెన్సీల నిర్వాహకులు డెలివరీ పేరుతో ఇష్టం వచ్చిన ధరలకు విక్రయాలు చేస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే తమకు తెలియదు గ్యాస్ డీలర్లు చెప్పిన ప్రకారం డబ్బులు తీసుకుంటున్నామని అంటున్నారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు తాండూరులో గ్యాస్ ఏజెన్సీ ఉంది. రూ. 1,172కు సరఫరా చేయాల్సిన సిలిండర్‌ను రూ. 1210 వసూలు చేస్తున్నారు. ప్రతి సిలిండర్‌పై డెలివరీ పేరిట అదనంగా రూ. 38 వసూలు చేస్తున్నారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోందని గొట్లపల్లికి చెందిన ఓ వినియోగదారులు తెలిపాడు. అదనపు వసూళ్లపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపించారు. సిలిండర్‌పై అదనంగా ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే గ్యాస్ గోదాంకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారని గొట్లపల్లి, ఆత్కూర్, మదనంతపూర్, ఎర్రగోడు తండాకు చెందిన ప్రజలు వాపోతున్నారు. గ్యాస్ ధరలు అమాంతం పెరగడంతో కట్టెల పొయ్యే మేలని పలువురు పేర్కొన్నారు. అదనపు వసూళ్లను నియంత్రించాల్సిన పౌరసరఫరా శాఖ తనిఖీలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. డెలివరీ సిబ్బంది అధికంగా వసూళ్లు చేస్తున్న సొమ్మును గ్యాస్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నట్లు సమాచారం.

అదనంగా వసూలు



పది రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ బుక్ చేశా. నాలుగు రోజుల క్రితం డెలివరీ చేశారు. రూ. 1172 లకు ఇవ్వాల్సిన సిలిండర్‌ను రూ. 1210 వసూలు చేశారు. అదనంగా రూ. 38 తీసుకున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మాకు సంబంధం లేదన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు చెప్పిన విధంగా వసూలు చేస్తున్నామని డెలివరీ సిబ్బంది తెలిపారు.

– ఖాజామైనొద్దీన్, గొట్లపల్లి, పెద్దేముల్ మండలం

అధికారులు స్పందించాలి



ప్రతి నెలా ఉన్నతాధికారులు గ్రామాలను సందర్శించాలి. సామాన్య ప్రజలకు వంట గ్యాస్ సరఫరాపై వివరాలు సేకరించాలి. ఏ ధరకు సిలిండర్ ఇస్తున్నారు.. అదనంగా ఎంత వసూలు చేస్తున్నారు వంటి వివరాలు తెలుసుకోవాలి. సిలిండర్ తీసుకున్న ప్రతిసారీ అదనంగా రూ. 30 నుంచి రూ. 40 వరకు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని అరికట్టాలి.

– నారాయణరెడ్డి, కొండాపూర్

బిల్లు ప్రకారమే డబ్బులు తీసుకోవాలి

ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలి. ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా వెంటనే ఫిర్యాదు చేయండి. వారిపై విచారణ జరిపి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే వారి లైసెన్సును రద్దు చేస్తాం. డెలివరీ బాధ్యత ఏజెన్సీలదే. గ్యాస్ వినియోగదారులు అదనపు డబ్బు ఇవ్వరాదు. అవసరం అయితే వాహనాలకు నిలిపి అధికారులకు ఫిర్యాదు చేయండి.

– రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



జినుగుర్తిలో ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన భూములు ఇవే..

రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బు

- రూ. 26కోట్లు జమ చేసిన సర్కారు
- ఎకరాకు రూ. 12లక్షల చొప్పున నగదు
- ఇండస్ట్రియల్ పార్కుకు మోక్షం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి శివారులో ఇండస్ట్రియల్ పార్కుకు మోక్షం లభించింది. రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేసింది. వారి ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు బుధవారం తెలిపారు. తాండూరు పట్టణంలో వందల సంఖ్యలో నాపరాతి పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్ల వల్ల కాలుష్యంతోపాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. పాలిషింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థాలను(సుద్ద) రోడ్డు పక్కనే పారబోయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఒకే చోట పరిశ్రమలను ఏర్పాటుకు ఇండస్ట్రియల్ పార్కును మంజూరు చేసింది.

216 ఎకరాలు సేకరణ

జినుగుర్తి శివారులోని సర్వే నంబర్ 206లో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి ఉంది. ఇండస్ట్రియల్ పార్కు కోసం 216 ఎకరాల 14 గుంటల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించారు. ఇందులో 82 మంది రైతుల భూమి ఉంది. ప్రభుత్వం ఎకరాకు రూ.12 లక్షల పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం 82 మంది రైతులకు రూ.26 కోట్ల నగదును వారివారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ భూములను టీఎస్ఐఐసీ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల సంస్థ)కు అప్పగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

మర్పల్లి: ఈతకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్లూర్ గ్రామానికి చెందిన ఆర్ నవీన్(25) మంగళవారం మధ్యాహ్నం మద్యం సేవించి గ్రామ సమీపంలో బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత కొడుతూ నీట మునిగి చనిపోయాడు. అయితే రాత్రి వరకు నవీన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు బావి వద్దకు వెళ్లారు. నీటిలో నవీన్ విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న మర్పల్లి పోలీసులు ఘటనా స్థలం చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

పాడుబడిన ఇళ్లు కూల్చేయండి



ధారూరు వీధుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ధారూరు: మండల కేంద్రంలో పాడుబడిన ఇళ్లు ఉండడంపై ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవి కూలి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ అధికారులపై మండిపడ్డారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో ఏం పనులు చేయించారని, వాటిని ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. బుధవారం ధారూరులో మీతో నేను కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే వీధుల్లో తిరిగి ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో ప్రతిరోజూ చెత్త సేకరించాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే వీధుల్లో వేలాడుతున్న తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. రైతు బంధు పథకం కింద ఇప్పటి వరకు గ్రామానికి రూ. 10 కోట్లు రావడం జరిగిందన్నారు. 16 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలకు రూ. 80లక్షలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి, నాయకులు సంతోష్ కుమార్, కే అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- తాండూరులో సుడిగాలి పర్యటన
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేత
- రోడ్డు పనులు, కంటి వెలుగు శిబిరం ప్రారంభం



ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో పేద ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా, పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో పండుగలు సంతోషంగా జరుపుకోవాలనే సీఎం కేసీఆర్ కానుకలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

26వ వార్డులో కంటి వెలుగు శిబిరం

అంధత్వ నివారణలకు బీఆర్ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని 26వ వార్డు కౌన్సిలర్ ఎం రాఘవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం

పట్టణంలోని 19వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రారంభించారు. రాయల్ గార్డెన్ నుంచి చెన్‌గేష్‌పూర్ మార్గంలోని ఈద్గా వరకు రూ. 20 లక్షలతో రోడ్డు వేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 40 ఏళ్లుగా జరగని అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలో జరుగుతోందన్నారు. రంజాన్ పండుగ నాటికి ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేస్తారని అప్పటిలోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు రూ. కోటి చొప్పున నిధులు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, కౌన్సిలర్లు ముక్తార్, రాఘవేందర్, సంగీత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్ విఠల్‌నాయక్, వెంకట్‌రెడ్డి, నాయకులు పీ నర్సింహులు, శ్రీనివాసాచారి, సంజీవరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ జరుపుకోవాలి



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, బీసీ కమిషన్ సభ్యుడు, ముస్లింలు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఘనంగా ఇఫ్తార్ విందు
- పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

వికారాబాద్ అర్బన్: భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వం తరఫున ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి సంవత్సరం ముస్లింలకు ఇఫ్తార్ విందు, పేదలకు తోఫాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. ముస్లింలు నెల రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేయడం దేవుని దయ అన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అల్లా ఆశీస్సులతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ఆర్డీఓ విజయకుమారి, మైనార్టీ నాయకులు తస్వర్ అలీ, జాఫర్. షరీఫ్, గయాజ్, జైనొద్దీన్, బషీర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి

- జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి

మర్పల్లి: మండలంలో వివిధ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అలసత్వం వహించరాదని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణితో కలసి ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎంపీడీఓ రాజ్ మల్లయ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి అధికారులతో ప్రతి వారం సమావేశం ఏర్పాటు చేసి పథకాల అమలు తీరుపై సమీక్ష జరపాలన్నారు. అనంతరం కల్‌ఖోడ గ్రామంలో ఫార్మేషన్ రోడ్డు పనులను, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. రావులపల్లిలో బృహత్ మండల ప్రకృతి వనం, నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోతే వాటి స్థానంలో కొత్త వాటిని నాటాలన్నారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది కృష్ణారావు, ఎంపీఓ మహేష్‌కుమార్, ఈసీ విఠల్, టీఏలు భాస్కర్, బలవంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ
- ఇద్దరు దుర్మరణం, మరొకరికి గాయాలు



ఘటనా స్థలిలో నిర్మల, కాకటి మృతదేహాలు

మహేశ్వరం: అతివేగంతో ఇద్దరి ప్రాణాలు పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని నాగుల్‌దోని తండా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాగుల్‌దోని తండాకు చెందిన అంగోత్ సంజునాయక్, భార్య నిర్మల(23) బైక్‌పై మహేశ్వరం వైపు వెళ్తున్నారు. అస్సాం రాష్ట్రం బలిగాన్ జిల్లా నాగోన్ గ్రామానికి చెందిన కుక్లి కకాటి(40) ద్విచక్రవాహనంపై మహేశ్వరం నుంచి నాగుల్‌దోని తండా వైపు ప్రయాణిస్తున్నాడు. తండా సమీపంలోని హనుమాన్ ఆలయం వద్దకు రాగానే అతివేగంగా ప్రయాణిస్తున్న రెండు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో అంగోత్ నిర్మల బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడడంతో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మరో బైక్ నడుపుతున్న కుక్లి కాకటి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ఎన్డీతండా సమీపంలో ఓ వెంచర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ పులిమామిడి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మరో క్షతగాత్రుడు సంజునాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పనులు త్వరితగతిన పూర్తిచేయండి

- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: మినీ స్టేడియం అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తన సొంత నిధులతో చేపడుతున్న మినీ స్టేడియం అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలిచ్చారు. వాకింగ్, రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, షటిల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉండేలా స్టేడియం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపీ వివరించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి శ్రమించాలి

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- హస్తం గూటికి బీఆర్ఎస్ నేతలు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జంగయ్య తదితరులు

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో టంగటూరు గ్రామానికి చెందిన శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు ఎ.జంగయ్య తన అనుచరులు వంద మందితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఉదయమోహన్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సున్నపు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, టంగటూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదిరెడ్డి, వార్డు సభ్యుడు రంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు పాండురంగారెడ్డి, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, మాధవ్‌రెడ్డి, కృష్ణమాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.